సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



'ఇంటర్'కు తత్కాల్ అవకాశం

విశాఖ విద్య : ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లించేందుకు తత్కాల్ అవకాశం కల్పించారు.ఈ నెల 31లోపు రూ.3 వేలు చెల్లించాలి.



సిరుల తల్లికి విశేష పూజలు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కనక మహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు జరిపారు.



గోదాదేవికి తిరువీధి సేవ

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోదాదేవికి తిరువీధి సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఘనంగా హై టీ క్రిస్మస్



చిన్నారులకు క్రిస్మస్ కేకును తినిపిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: ఏసుక్రీస్తు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక కాఫీ అతిథి గృహంలో సోమవారం రాత్రి హై టీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను కలెక్టర్ కట్ చేసి చిన్నారులు, దైవసేవకులకు తినిపించారు. జిల్లాలోని ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాస్టర్లకు గౌరవ వేతనం కింద నెలకు రూ.5వేలను ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. క్రిస్టియన్ విద్యార్థులు విదేశాల్లో చదివేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాస్టర్లలో గ్రూప్‌లు ఉండకూడదని,అందరూ సమానంగా ఉండాలని, శాంతి, సహనం,ప్రేమతో మెలగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ,సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, ఏపీఎంఐపీ పీడీ రహీం తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తుఫాన్ భయం

- పలుచోట్ల జల్లుల వాన



హుకుంపేట మండలం వోల్డా ప్రాంతంలో టార్పాలిన్‌లు కప్పిన వరి కుప్పలు

సాక్షి,పాడేరు: జిల్లా రైతులను మళ్లీ తుఫాన్ భయం వెంటాడుతోంది. సోమవారం వాతావరణంలో మార్పులు రావడంతో పాటు కొన్ని చోట్ల ఓ మోస్తారు వర్షం కురిసింది. పాడేరు,హుకుంపేట ప్రాంతాలలో రాత్రి వరకు జల్లుల వాన కురుస్తూనే ఉంది. ఇంకా వరిపంట కోతలు,నూర్పుల పనులు 30 శాతం మిగిలిఉన్న పరిస్థితుల్లో అకాల వర్షాలు గిరిజన రైతులను కలవరపరుస్తున్నాయి. పంటరక్షణకు చర్యలుతీసుకున్నారు. వరిపనలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు వరి కుప్పలపై టార్పాలిన్‌లు కప్పారు.

కాఫీని జీసీసీకి విక్రయించాలి



కాఫీ పల్పింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న జీసీసీ మేనేజర్ సింహాచలం

డుంబ్రిగుడ: మండలంలోని రైతులు కాఫీ పంటను జీసీసీకి విక్రయించాలని డివిజన్ మేనేజర్ సింహాచలం కోరారు. తూటంగి పంచాయతీ కాఫీ రైతులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సహకార సంస్థ గత ఏడాది కంటే ఈ సంవత్సరం అధికంగా కాఫీని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. కిలో పార్చ్‌మెంట్ కాఫీ రూ.320, చెర్రీ రూ.170, రోబస్టా రూ.100కు కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. అధికంగా రేటు ఇస్తున్నారన్న ఆశతో పలువురు రైతులు దళారులకు కాఫీ విక్రయిస్తున్నారని, దళారులను నమ్మితే మోసపోవడం ఖాయమని చెప్పారు. అనంతరం కాఫీ పండ్లను పల్పింగ్ చేస్తున్న విధానాన్ని, ఆరబెట్టిన పార్చ్‌మెంట్ కాఫీ గింజలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో కాఫీ పుల్లింగ్ అసిస్టెంట్ చిన్నంనాయుడు, చక్రి, రైతులు పాల్గొన్నారు.

చెరువులో గుర్తుతెలియని బాలుడి మృతదేహం

- అదృశ్యమైన గురుకుల విద్యార్థిది కావచ్చని అనుమానం

కొయ్యూరు: స్థానిక గురుకుల పాఠశాలకు కొద్ది దూరంలో ఉన్న చెరువులో ఓ బాలుడి మృతదేహాన్ని సోమవారం సాయంత్రం కనుగొన్నారు. గుర్తుపట్టలేని విధంగా ఉన్న మృతదేహాన్ని మంగళవారం బయటకు తీయనున్నారు. కొయ్యూరు గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న వంతల మనోజ్ ఈ నెల13వ తేదీ సాయంత్రం అదృశ్యమయ్యాడు. చెరువులో ఉన్న మృతదేహం మనోజ్‌దిగా అనుమానిస్తున్నారు. మనోజ్ అదృశ్యమైన నాటి నుంచి అతని ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. తల్లిదండ్రులు కూడా పది రోజుల నుంచి కొడుకు కోసం పాఠశాలలోనే ఉండిపోయారు. కొయ్యూరు ఎస్‌ఐ కిషోర్ వర్మ సోమవారం మాట్లాడుతూ చెరువులో పూర్తిగా పాడైన బాలుడి మృతదేహం ఉందన్నారు.అది గురుకుల విద్యార్థిది కావచ్చని అనుమానిస్తున్నామని చెప్పారు.

అప్పు శయ్యపై.. అన్నదాత



“ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు కొర్రా రామమూర్తి. హుకుంపేట మండలం రాతుల పుట్టుకు చెందిన ఈయన ఈ ఏడాది తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. డబ్బుకోసం ఇటీవల హుకుంపేట సంతలో జత పాడి పశువులను రూ.16వేల తక్కువ ధరతో అమ్ముకున్నాడు. వ్యవసాయ సీజన్‌లో వాటిని అమ్మితే కనీసం రూ.50వేలు లభించేది. అత్యవసరంగా అమ్ముకోవలసి రావడంతో సుమారు రూ.35 వేల వరకు నష్టపోయాడు. నష్టం రావడంతో పాటు ఎంతో ప్రేమగా సాకే పశువులు ఇల్లు దాటిపోవడంతో ఆవేదనకు గురయ్యాడు. వ్యవసాయ పెట్టుబడికి కూటమి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.



ఈ చిత్రంలో ఉన్న రైతు కొర్రా లీవ్. పెదబయలు మండలం వనభంగి పంచాయతీ తోటలగొంది గ్రామానికి చెందిన ఈయనకు ముగ్గురు పిల్లలు. వీరంతా గిరిజన సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్నారు. పిల్లలకు తల్లికి వందనం సాయం అందలేదు. కాస్మొటిక్స్ చార్జీలను ప్రభుత్వం చెల్లించలేదు. లీవ్‌కు వ్యవసాయ పెట్టుబడికి ఎటువంటి సాయం అందలేదు. దీంతో అప్పు చేయవలసి వచ్చింది. ఆ అప్పు తీర్చేందుకు తన రెండు దుక్కి పశువులను గుత్తులపుట్టు సంతలో తక్కువ ధరకు అమ్ముకున్నాడు. ఇతనితో పాటు తోటలగొంది గ్రామానికి చెందిన పలువురు పెద్ద ఎత్తున పశువులను అమ్ముకున్నారు.”

వ్యవసాయమనే జూదంలో గిరి రైతులు ఓడిపోతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడితో ఆరుగాలం కష్టిస్తే పంటలు పండక...గిట్టుబాటు ధర లభించక అప్పులపాలవుతున్నారు. అప్పులు, అవస్థలు, కన్నీళ్లే మిగులుతున్నాయి. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడతో రైతుల పరిస్థితి దుర్భరంగా మారింది. చివరకు పశువులను అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడింది.



గుత్తులపుట్టు సంతలో పశువులను అమ్ముకుంటున్న గిరిజన రైతులు

గిరి రైతు కన్నీరు తుడిచేదెవరు ?

- దిగుబడి తగ్గిన పంటలు
- ప్రభుత్వం నుంచి అందని సాయం
- ఆర్థిక ఇబ్బందుల్లో అన్నదాతలు
- పశువులు,మేకలను అమ్ముకుంటున్న దుస్థితి

పశువుల సంతలు.. 8 గ్రామాల్లో

ప్రతి సంతలో విక్రయిస్తున్న పశువులు 300

వ్యాపారం : రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలు

ఒక్కో సంతలో రైతులకు నష్టం రూ.20 లక్షలు

జిల్లాలో పశువుల వివరాలు

ఆవులు, దుక్కి పశువులు	62,5951
గేదెలు	91,868
గొర్రెలు	1,93,361
మేకలు	3,82,483

తక్కువ ధరతో పశువుల అమ్మకాలు

గిరిజన రైతులకు ఈ సీజన్‌లో ఆర్థిక అవసరాలు అధికమయ్యాయి. లాభాలు ఇచ్చే రాజ్‌మా పంట కూడా అకాల వర్షాలతో దెబ్బతింది. పంట దిగుబడి భారీగా తగ్గడంతో చేసిన అప్పులు తీర్చడం కోసం, ఇంటి అవసరాల కోసం తమ వద్ద ఉన్న పాడి పశువులు,గేదేలు, మేకలు,గొర్రెలను తక్కువ ధరకు నష్టానికి అమ్ముకుంటున్నారు.ప్రస్తుతం ఏజెన్సీలోని అన్ని సంతల్లో గొర్రెలు, మేకల వ్యాపారమే అధికంగా జరుగుతోంది.

సాక్షి,పాడేరు: రైతు ఎంత కష్ట పడుతున్నా ఆశించిన ప్రతిఫలం దక్కడంలేదు. దీంతో వారి శ్రమ ఆవిరైపోతోంది. ఈ ఏడాది పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పంటల దిగుబడి తగ్గడంతో పాటు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక జిల్లా వ్యాప్తంగా గిరిజన రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలతో పాటు ప్రత్యేకంగా రైతు భరోసాతో వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందుకున్న అన్నదాతలు సంతోషంగా ఉండేవారు.

గత ప్రభుత్వంలో ఏడాదికి రూ.127 కోట్ల సాయం

జిల్లాలో 1,69,000 మంది రైతులకు రూ.13,500 చొప్పున ఏడాది రూ.127 కోట్ల ఆర్థిక సాయాన్ని గత ప్రభుత్వం అందజేసింది. ఇలా నాలుగేళ్లపాటు వారి ఖాతాలో నగదు జమ అయింది. దీంతో అప్పులు చేయకుండా వ్యవసాయానికి పెట్టుబడి పెట్టడంతో పాటు చిన్న చిన్న అవసరాలకు ఎవరి వద్ద చేయిచాపవలసిన పరిస్థితి ఉండేది కాదు. ఉచిత పంటల బీమా పథకం కూడా అమలయ్యేది. ఐదేళ్ల పాటు దర్జాగా బతికిన గిరిజన రైతులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో అప్పుల పాలవుతున్నారు. చిన్నచిన్న ఆర్థిక అవసరాలు తీర్చుకోడానికి కూడా రుణాలు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక, ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో చేసేది లేక ఎంతో ప్రేమతో సాకే విలువైన పశు సంపదను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి రూ.20వేల చొప్పున అన్నదాత సుఖీభవ పేరుతో ఆర్థిక సాయం చేస్తానని చంద్రబాబు సూపర్ సిక్స్‌లో ప్రకటించి, ఇప్పుడు మోసం చేశారని గిరిజన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ సీజన్ నుంచి గిరిజన రైతులు కూటమి ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం ఎదురుచూసినా ఫలితం లేకపోయింది.

కొంటే రూ.50 వేలు...అమ్మితే రూ.20 వేలు

గిరిజన రైతుల ఆర్థిక అవసరాలు పశువుల వ్యాపారులకు కలిసొచ్చింది.మేలు జాతి పశువులను ఈ ఏడాది మే నెలలో రూ.50వేల ధరతో కొనుగోలు చేసిన గిరిజన రైతులు.. ప్రస్తుతం అవే పశువులను సంతల్లో అమ్మకానికి పెడితే రూ.16వేల నుంచి రూ.20వేలకు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు.డబ్బు అవసరం కావడంతో రైతులు తక్కువ ధరతోనే అమ్ముకుంటూ ఉసూరుమంటున్నారు.

జిల్లాలో గుత్తులపుట్టులో గురువారం,అన్నవరంలో సోమవారం,జి.మాడుగులలో మంగళవారం,అరకు గ్రామంలో శుక్రవారం,సుంకరమెట్టులో ఆదివారం, కించమండలో బుధవారం, హుకుంపేట, ముంచంగిపుట్టులలో శనివారం జరిగే పశువుల సంతల్లో ఒక్కో సంతలో మూడు వందల వరకు పశువులును రైతులు విక్రయిస్తున్నారు. ప్రతి సంతలోను సుమారు రూ.30 లక్షల నుంచి రూ.50లక్షల వరకు పశువుల వ్యాపారం జరుగుతోంది. పశువులను అమ్ముకుంటున్న వారంతా పేద గిరిజనులే.అలాగే మేకలు,గొర్రెలను గిరిజన రైతులు ప్రతి ఏడాది గ్రామదేవతల పండగలు జరిగే ఏప్రిల్,మే నెలలతో పాటు దసరా పండగ సమయంలో మంచి ధరలతో అమ్ముకునే పరిస్థితి.కాని డబ్బు అవసరాల కారణంగా వాటిని తక్కువ ధరకు అమ్ముకోవలసి వస్తోంది.పండగల సమయంలో రూ.10వేలు ధర పలికే మేక,గొర్రెలను ప్రస్తుతం సంతల్లో రూ.6వేలకు అమ్ముకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు.గిరిజన రైతుల పరిస్థితి మన్యంలో దయనీయంగా మారింది.



మేకలను విక్రయిస్తున్న గిరి రైతులు

రైతు భరోసా లేక ఆర్థిక ఇబ్బందులు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ప్రతి ఏడాది రూ.13,500 చొప్పున అందజేసిన ఆర్థిక సాయంతో ఇబ్బందులు లేకుండా పంటలు సాగుచేసే వారం. కొత్త ప్రభుత్వం వచ్చాక ఒక్క పైసా సాయం చేయకపోవడంతో పంటలు వేయడానికి అప్పులు చేయవలసి వచ్చింది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– నిక్కుల మాలన్న, బర్మన్‌గుడ గ్రామం, హుకుంపేట మండలం

రాజ్‌మా పంట పోయింది



క్రిస్మస్,సంక్రాంతి పండగలకు ఆర్థికంగా ఆదుకునే రాజ్‌మా పంట ఈ ఏడాది దెబ్బతింది.పూత,కాయ దశలో కురిసిన అధిక వర్షాలు పంటకు నష్టం కలిగించాయి. అర ఎకరం భూమిలో సాగుచేసిన పంటంతా పాడైంది.చేతిలో చిల్లి గవ్వకూడా లేని పరిస్థితి. దీంతో ఆర్థిక అవసరాలు, పండగ ఖర్చులు గట్టిందుకు పశువులను అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

–సుర్ల కుర్రమ్మ,చింతలవీధి, పాడేరు మండలం

విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాట



వైఎస్సార్‌సీపీ పోరుబాట ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పార్టీ నాయకులు

- 27న విద్యుత్ కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆందోళన

సాక్షి,పాడేరు: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 27న జిల్లా కేంద్రం పాడేరులో పోరుబాట నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. పోరుబాటకు సంబంధించిన ప్రచార పోస్టర్లను సోమవారం పాడేరులోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని,అవసరమైతే తగ్గిస్తామని బూటకపు మాటలు చెప్పి ప్రజలకు మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై విద్యుత్ చార్జీల రూపంలో కూటమి ప్రభుత్వం భారం మోపడాన్ని నిరసిస్తూ తమ పార్టీ అధ్యక్షుడు,మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ పోరుబాటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. పాడేరులో పార్టీ నాయకులు, ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించి, విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు చెప్పారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,అన్ని వర్గాల విద్యుత్ వినియోగదారులు పాల్గొని ఈపోరుబాటను విజయవంతం చేయాలని ఆయన కోరారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఎస్టీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, ఎంపీటీసీలు లకే రామకృష్ణపాత్రుడు, దూసురు గంగరాజు,తూవురు గంగరాజు,సర్పంచ్‌లు వనుగు బసవన్నదొర,వంతాల రాంబాబు,సోమెలి లక్ష్మణరావు,సీనియర్ నాయకులు మినుముల కన్నాపాత్రుడు,శరబ సూర్యనారాయణ, డి.పి.రాంబాబు,బోనంగి రమణ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విజృంభిస్తున్న చలి గాలులు

సాక్షి,పాడేరు/చింతపల్లి: జిల్లాలో చలిగాలులు మళ్లీ విజృంభిస్తున్నాయి.రెండు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి.మరోవైపు పొగమంచు దట్టంగా కురుస్తోంది.ఉదయం 9గంటల వరకు మంచుతెరలు వీడకపోవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకునే వాహనాలను నడుపుతున్నారు. పాడేరు,అనంతగిరి,లంబసింగి,సప్పర్ల,రొంపుల,మారేడుమిల్లి ఘాట్ రోడ్లలో పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉంది. గిరిజనులు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.ఏజెన్సీని సందర్శించే పర్యాటకులు కూడా ఫైర్ క్యాంపులతో ఉపశమనం పొందుతున్నారు. జి.మాడుగులలో 9.7 డిగ్రీలు,జీకే వీధి 10.8,పెదబయలు 11.1,డుంబ్రిగుడ 11.6, ముంచంగిపుట్టు 12.1, హుకుంపేట 12.4, పాడేరు 13.8, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 14, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.3, అనంతగిరిలో 14.3, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 15.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు సోమవారం నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.



మంచులో లైట్ వేసుకుని ప్రయాణం

వారాంతంలో అరకు స్పెషల్స్

తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా శని,ఆదివారాల్లో విశాఖపట్నం–అరకు మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం–అరకు–విశాఖపట్నం(08525/08526) స్పెషల్ రైళ్లు ప్రతి శని, ఆదివారాల్లో విశాఖపట్నంలో ఉదయం 8.30 గంటలకు బయల్దేరి అదే రోజు ఉదయం 11.45 గంటలకు అరకు చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో అరకులో ప్రతి శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరి సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నం చేరుకుంటాయి. ఈ స్పెషల్ రైళ్లు ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 19వ తేదీ వరకు నడుస్తాయి. ఈ స్పెషల్ రైళ్లు 1–సెకండ్ ఏసీ, 1–థర్డ్ ఏసీ, 10–స్లీపర్ క్లాస్, 4–జనరల్ సెకండ్ క్లాస్, 2–సెకండ్ క్లాస్ కమ్ లగేజీ, దివ్యాంగ కోచ్‌లతో నడుస్తాయి.

డైట్ కళాశాల పీడీ సస్పెన్షన్




డైట్ కళాశాలలో విచారణ చేస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌పై దురుసుగా ప్రవర్తించిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్(పీడీ) కె.పోతురాజును సస్పెండ్ చేసినట్టు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి తెలిపారు. ఈ నెల 19న కళాశాల ప్రాంగణంలో అసెంబ్లీ జరుగుతుండగా విద్యార్థినులు,కళాశాల సిబ్బంది ముందు ప్రిన్సిపాల్‌పై దురుసుగా ప్రవర్తించి, దాడి చేసినందుకు సస్పెండ్ చేసినట్టు తెలిపారు. డీడీ తన కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ జరిగిన సంఘటనపై కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ ఘటనపై విచారణ చేయవలసిందిగా సబ్ కలెక్టర్ కల్పశ్రీకి పీవో ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ప్రాథమిక విచారణ నివేదిక ప్రకారం.. పీవో ఆదేశాల మేరకు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న పీడీ పోతురాజును సస్పెండ్ చేసినట్టు చెప్పారు. పూర్తి స్థాయి విచారణకు కూనవరం ఏటీడబ్ల్యూవో సుజాతను నియమించినట్టు తెలిపారు. కళాశాల విద్యార్థిని పట్ల కూడా పీడీ దురుసుగా ప్రవర్తించినట్టు సమాచారం.

నావికాదళ విన్యాసాలకు ఏర్పాట్లు



విన్యాసాలకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



తీరానికి చేరుకుంటున్న నావికాదళ నౌక


ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులో జనవరి 4వ తేదీన నిర్వహించే నావికాదళ విన్యాసాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం విశ్వప్రియ కన్వెన్షన్ హాల్ ఎదురుగా వేదిక నిర్మాణం జరుగుతోంది. అదే విధంగా బీచ్‌రోడ్డులో బారికేడ్లు నిర్మిస్తున్నారు. అదే విధంగా నావికాదళ నౌకలు విశాఖ తీరానికి చేరుకుంటున్నాయి.

–ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

పారదర్శకంగా పీసా ఎన్నికలు

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం

పాడేరు రూరల్: పీసా కమిటీల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఈవోఆర్డీలు, మండల ప్రత్యేక అధికారులకు పీసా కమిటీల ఎన్నికల నిర్వహణపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పరిధిలో 239 పంచాయతీలతో పాటు మైదాన ప్రాంతమైన నాతవరం పరిధిలో ఉన్న ఐదు గ్రామ పంచాయతీలు కలిపి మొత్తం 244 పంచాయతీల్లో 1,026 పీసా గ్రామాల్లో ఉపాధ్యక్ష,కార్యదర్శి పదవులకు వచ్చే నెల 3 నుంచి 7 వ తేదీ వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు చెప్పారు. పార్టీ రహితంగా నిర్వహిస్తున్న ఈ ఎన్నికల్లో పీసా గ్రామాలకు చెందిన వారు ఎవరైనా పోటీ చేయవచ్చని ఆయన చెప్పారు. తహసీల్దార్లు తక్షణమే ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్ మాట్లాడుతూ ఎన్నికల అధికారులను నియమించే బాధ్యతను ఎంపీడీవోలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ భవనాల్లోనే ఎన్నికల నిర్వహించాలన్నారు. పీసా గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి ప్రభాకరరావు, ఇన్‌చార్జి డీడీ రజిని, ఆర్‌వోఎఫ్ఆర్ డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీవో అభిషేక్

క్లుప్తంగా

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

హుకుంపేట: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని రంగశీలలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతోనే ఈ సదస్సులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్ మోహన్‌దాసు, ఎంపీటీసీ గంజాయి సుశీల తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.78.78 లక్షలు



లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో గత నెల 13 నుంచి ఈ నెల 23 వరకు హుండీల ద్వారా వచ్చిన నగదు, బంగారం, వెండి తదితర కానుకలను సోమవారం లెక్కించారు. ఇందులో రూ.78 లక్షల 78 వేల 841 నగదుతో పాటు 59.100 గ్రాముల బంగారం, 690 గ్రాముల వెండి వచ్చింది. వీటితోపాటు 143 యూఎస్ డాలర్లు, 10 ఆస్ట్రేలియా, 20 కెనడియన్ డాలర్లు, ఇతర దేశాల కరెన్సీలున్నాయి.

పట్టు చిక్కితే సిరులే..!

- లాభాలు కురిపిస్తున్న పట్టు పురుగుల పెంపకం
- రైతులను ప్రోత్సహిస్తున్న సెరికల్చర్ శాఖ
- అనకాపల్లి జిల్లాలో 284 హెక్టార్లల్లో మల్బరీ సాగు



లాభాలు ఇలా..

ఒక ఎకరా పరిధిలో మల్బరీ తోటలను పెంచి టైప్–1 షెడ్‌లో 200ల చాకీ పురుగులను పెంచితే ఏడాదికి నాలుగు దఫాలు పట్టుగూళ్లను తీయవచ్చు. అంటే ఏడాదికి 800 కిలోల పట్టుగూళ్ల ఉత్పత్తి సాధ్యమవుతుంది. ప్రస్తుతం ధర కిలో రూ.650 ఉండగా 800 కిలోలకు రూ.5,20,000 వరకు ఆదాయం సమకూరుతుంది.

రైతు రారాజుగా వెలగాలంటే అందివచ్చిన అవకాశాలను ఒడిసిపట్టుకోవాలి. నిరంతరం కొత్తదనం కోసం ఆలోచన చేయాలి. పది మందీ చేసే సాగు కాకుండా నా రూటే సెపరేటు అన్నట్టుగా ఔరా అనిపించేలా లాభాల పంట పండించాలి. అపుడే రైతు నష్టాల నుంచి తప్పించుకుని లాభాల బాటలో పయనించే అవకాశం ఉంటుంది.



చాకీ పురుగులను పెంచే షెడ్



మల్బరీ తోట

కోటవురట్ల: వ్యవసాయ రంగంలో పెనుమార్పులు వచ్చాయి. తదనుగుణంగా రైతులు ముందుకడుగేస్తున్నారు. మారే కాలంతో పాటు పరుగులు తీస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. పట్టు పరిశ్రమ తక్కువ కాలంలోనే ఎక్కువ ఆదాయం తెచ్చిపెడుతోంది. అందుకే ఇప్పుడు అందరి దృష్టి ఈ రంగంపై పడింది. ఒకప్పుడు ఏజెన్సీకే పరిమితమైన పట్టు పురుగుల పెంపకం ఇపుడు మైదానానికి పాకింది. కాస్త ఓపిక, శ్రద్ధ ఉంటే చాలు లాభాలు మెండుగా వస్తాయని పట్టు పరిశ్రమ శాఖాధికారులు చెబుతున్నారు. పట్టు పురుగుల పెంపకానికి సెరికల్చర్ శాఖ రాయితీలు కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. అవగాహన కార్యక్రమాల ద్వారా సలహాలు, సూచనలు అందిస్తోంది. జిల్లాలో 284 ఎకరాల్లో పట్టు పురుగుల పెంపకం జరుగుతోంది. అందులో కోటవురట్ల మండలంలో అత్యధికంగా 125 ఎకరాల్లో మల్బరీ తోటలు పెంచుతున్నారు. ఇంకా నాతవరం, మాకవరపాలెం తదితర మండలాల్లో పట్టు పురుగుల పెంపకం చేపడుతున్నారు.

నెలలోనే ఆదాయం..

పట్టు పరిశ్రమ ద్వారా నెలలోనే ఆదాయాన్ని పొందే అవకాశం ఉంది. పట్టు పురుగుల పెంపకానికి ప్రధానంగా కావలసిన మల్బరీ మొక్కలను ఒకసారి నాటితే 15 ఏళ్ల వరకు తిరిగి చూడనవసరం లేదు. ఇది బహువార్షిక మొక్క కావడంతో అన్ని కాలాల్లోనూ ఆకులు చిగురిస్తాయి. ఎక్కువ నీటి వసతి అవసరం ఉంటుంది. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా తక్కువ ఖర్చుతో నీటిని ఆదా చేసి మల్బరీ తోటలను పెంచవచ్చు. రసాయనిక ఎరువుల అవసరం లేకుండానే మల్బరీ తోటలు ఏపుగా పెరిగే అవకాశం ఉంది. ఒకసారి కోతకు వచ్చాక ఏడాదికి 8 నుంచి 10 దఫాలుగా కోత తీయవచ్చు. పట్టు గూళ్ల కోసం చాకీ పురుగులను 20 రోజులపాటు షెడ్లో జాగ్రత్తగా పెంచాల్సి ఉంటుంది. వీటికి మేతగా మల్బరీ ఆకులను వేస్తుండాలి. వీటిని తిన్న చాకీ పురుగులు పట్టు గూళ్లను అల్లుతాయి. ఇలా 28 రోజుల్లోనే పట్టుగూళ్లు ఎగుమతికి సిద్ధమవుతాయి. తయారైన పట్టుగూళ్లను పాడేరు, చేబ్రోలు, హిందూపూర్, హనుమాన్ జంక్షన్, విజయనగరం, సీతంపేటకు ఎగుమతి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పట్టు గూళ్ల ధర కిలో రూ.650 వరకు పలుకుతోంది. ఇది కాకుండా సెరికల్చర్ శాఖ రైతుకు అదనంగా కిలోకు రూ.50 వంతున ప్రోత్సాహకం చెల్లిస్తోంది.

యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూస్తున్న యువకులకు పట్టు పరిశ్రమ మంచి అవకాశం కల్పిస్తోంది. నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో పట్టు గూళ్ల నుంచి పట్టు దారం తీసే కేంద్రం నెలకొల్పేందుకు పట్టు పరిశ్రమ అవకాశం కల్పిస్తోంది. యూనిట్ ధర సుమారు రూ.12 లక్షలు ఉండగా పట్టు పరిశ్రమ 75 శాతం రాయితీ కల్పిస్తోంది. మిగతా 25 శాతం లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది. దీంతో పాటు మార్కెటింగ్ చేసేందుకు లబ్ధిదారులే సొంతంగా పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఎవరైనా ఆసక్తి చూపిస్తే యలమంచిలి పట్టణంలో పట్టు పరిశ్రమకు చెందిన స్థలాన్ని లీజుకు ఇచ్చి యూనిట్‌ను నెలకొల్పేందుకు అవకాశం కల్పిస్తున్నారు. దీంతో స్థానిక రైతులకు ఎగుమతి కష్టాలు తప్పుతాయి. యువతకు ఉపాధి లభిస్తుంది.

రాయితీలతో ప్రోత్సాహం..

పట్టు పరిశ్రమను నడిపేందుకు రైతులకు ఆ శాఖ పలు రాయితీలను అందిస్తోంది. మల్బరీ మొక్కలు నాటుకోవడానికి, షెడ్ నిర్మాణానికి, ఘాట్ నిర్మించుకోవడానికి, ఇతర పరికరాలను రాయితీలు ఇస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు మొక్కలు నాటేందుకు రూ.22,500, షెడ్ నిర్మాణానికి రూ.3,37,500లు, ఓసీ, బీసీలకు మొక్కలు నాటేందుకు రూ.27 వేలు, షెడ్డు నిర్మాణానికి రూ.4,05,000 ఆర్థిక సహాయం ఇస్తున్నారు. ఇవికాకుండా ఎస్టీ రైతులకు షెడ్ నిర్మించుకోవడానికి అదనంగా రూ.లక్ష ట్రైకార్ ద్వారా ఇస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సన్నకారు రైతులకు అదనంగా రెండు ఎకరాల్లో మొక్కల పెంపకానికి ఖర్చులుగా రూ.63 వేలు అందిస్తున్నారు. ఇలా పలు రాయితీలతో పట్టు పరిశ్రమ నడిపేందుకు రైతుకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారు.

లాభదాయకం



పట్టు పురుగుల పెంపకం లాభదాయకంగా ఉంది. నేను రెండు ఎకరాల్లో మల్బరీ తోటలను పెంచుతున్నాను. ఏడాదికి నాలుగు దఫాలుగా పట్టుగూళ్లను తీయొచ్చు. అయితే పట్టు పరిశ్రమ శాఖ అదనంగా ప్రోత్సాహంగా ఇవ్వాల్సిన రూ.50 ఇవ్వడం లేదు. ఆ నిధులు వెంటనే విడుదల చేయాలి.

– జవ్వాది సోమేశ్వరరావు, రైతు, కోటవురట్ల

ప్రోత్సాహం ఇస్తున్నాం..



పట్టు పరిశ్రమ పెట్టుకునే రైతులను అనేక రాయితీలతో ప్రోత్సహిస్తున్నాం. పట్టు పరిశ్రమ కోసం మల్బరీ మొక్కను ఇవ్వడం నుంచి షెడ్ నిర్మాణం వరకు ఆర్థిక సహాయం ఇస్తోంది. ఏ పంటలో లేని ఆదాయం పట్టు పరిశ్రమలో ఉంది. శ్రద్ధగా చేస్తే ఒక ఎకరా పరిధిలో మల్బరీ తోటల పెంపకంతో ఏడాదికి రూ.5 లక్షల ఆదాయాన్ని తీసుకోవచ్చు. ఎన్నో రాయితీలు ఇస్తున్నాం. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబరు 9866699169లో సంప్రదించండి.

– తాళ్లూరి రాజేంద్రప్రసాద్, పట్టు పరిశ్రమశాఖ జిల్లా అధికారి

హిట్ అండ్ రన్ కేసులపై అవగాహన

- కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్

సాక్షి, పాడేరు: హిట్ అండ్ రన్ ప్రమాదాల కేసులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లో హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి అధికారులతో సోమవారం హైబ్రిడ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం జరిగిన సమయంలో వాహనాన్ని గుర్తించలేనప్పుడు వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రమాదాలలో మరణించిన లేదా గాయపడిన వ్యక్తులకు బీమా పరిహారాన్ని కూడా ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్‌గౌడ, పాడేరు, రంపచోడవరం సబ్‌కలెక్టర్‌లు సౌర్య మన్‌పటేల్, కల్పశ్రీ, పాడేరు డీఎస్పీ ప్రమోద్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా, జిల్లా రవాణా అధికారి లీలాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం



విజయసాయిరెడ్డికి స్వాగతం పలికిన పార్టీ నేతలు

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డికి విశాఖ ఎయిర్‌పోర్టులో సోమవారం ఘన స్వాగతం లభించింది. వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, ముఖ్యనేతలు కొండా రాజీవ్‌గాంధీ, దేవన్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. విద్యుత్ చార్జీల బాదుడుపై ఈ నెల 27న పార్టీ తలపెట్టిన 'వైఎస్సార్ సీపీ పోరుబాట' పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించనున్నారు.

ఒక వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్ : ఒక వ్యక్తి మృతికి కారణమైన నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 2 వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. వెంకటరమణ సోమవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. అదనపు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పీజీఎస్ఎన్ ప్రసాద్ రావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ఉమ్మడి విశాఖ జిల్లా పెదబయలు పోలీస్ స్టేషన్ పరిధిలోని గంపదర సత్తిబాబు (42) పెదకోడేపల్లి గ్రామంలో ఉంటున్నాడు. పంట పొలాలకు జంతువులు, పందులు రాకుండా విద్యుత్ కంచె ఏర్పాటు చేసుకున్నాడు. ప్రభుత్వం లేదా విద్యుత్ శాఖ అనుమతి లేకుండా ఆ పొలానికి రాత్రిపూట విద్యుత్ కంచెలను అమర్చాడు. ఈ నేపథ్యంలో 2014 సెప్టెంబర్ 5వ తేదీ ఉదయం మజ్జి బాలరాజు తన గ్రామ సమీపంలోని సంతకు బయలుదేరాడు. విద్యుత్ కంచి ఉన్న ప్రాంతం నుంచి సంతకు వెళుతూ ఉండగా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య నూకాలమ్మ ఫిర్యాదు మేరకు పెదబయలు పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 235, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ చట్టం 2003 కింద పెదబయలు పోలీసులు కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు. కేసులో 9 మంది నిందితుల కాగా కేవలం రెండో నిందితుడికి సత్తిబాబుకు జైలు శిక్ష విధించారు.

పెద్దేరుకు వరద పోటు

300 క్యూసెక్కుల వరద నీరు విడుదల



పెద్దేరు జలాశయం నుంచి వరద నీరు విడుదల చేస్తున్న దృశ్యం

మాడుగుల: గత మూడు రోజులుగా పెద్దేరు జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలకు సోమవారం వరదపోటు మొదలైంది. దీంతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. వారం కిందట జలాశయంలోకి 50 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ప్రస్తుతం 200 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో సోమవారం సాయంకాలం జలాశయం ప్రధాన గేటు ద్వారా 300 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.45కు పెరిగింది. పెద్దేరు ఏటి బాధితులు రాత్రి పూట పెద్దేరులోకి దిగరాదని, జలాశయంలో నీటి నిల్వలు అధికంగా ఉండడంతో ఏ సమయంలోనైనా జలాశయం నుంచి వరద నీరు విడుదల చేయవచ్చునని, రైతులు అప్రమత్తంగా ఉండాలని జలాశయం అధికారులు చెబుతున్నారు.

మద్యం మత్తులో భార్యపై భర్త దాడి



గాయపడిన అప్పలమ్మ

హుకుంపేట: మద్యం మత్తులో తన భార్యపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఒల్డా పంచాయతీ కేంద్రాంలో మజ్జి చిట్టిబాబు మద్యం మత్తులో తన భార్య అప్పలమ్మను సోమవారం ఉదయం గొడవలు పడి కత్తితో మెడపై బలంగా దాడి చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అప్పలమ్మను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఇంకా ఫిర్యాదు అందలేదు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ కార్యకర్త మృతి



రహీం మనీషా (ఫైల్)

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 43 వార్డు అక్కయ్యపాలెం, శ్రీనివాసనగర్‌కు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త రహీం మనీషా బేగం చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. వివరాలు ఇలా... అక్కయ్యపాలెంలో శ్రీనివాసనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బేగం కార్యకర్తగా పనిచేస్తుంది. గోపాలపట్నానికి చెందిన సంగీత, రహీం మనీషా బేగం ఇద్దరూ డిగ్రీ నుంచి స్నేహితులు. ఇదిలావుండగా ఈ నెల 4న సంగీత, బేగంలు అక్కయ్యపాలెంలో కలుసుకున్నారు. ఓ ఆటోలో కూర్చుని చాలా సేపు మాట్లాడుకున్నారు. వీరిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలున్నాయి. దీంతో ఆటోలో ఇద్దరూ గొడవపడ్డారు. ముందుగానే తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను బేగంపై పోసి నిప్పటించి అక్కడి నుంచి సంగీత పరారైంది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 65శాతం కాలిపోయిన బేగంను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నాటి నుంచి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని ఫోర్తుటౌన్ పోలీసులు తెలిపారు.

పెద్దేరు నదిలో మునిగి కాడెడ్లు మృతి

రైతుకు త్రుటిలో తప్పిన ప్రమాదం



మృతి చెందిన కాడెడ్లు

మాడుగుల : మండలంలో జంపెన వద్ద ప్రవహిస్తున్న పెద్దేరు నదిలో సోమవారం ప్రమాదవశాత్తూ రెండు కాడెడ్లు మునిగి మృతి చెందాయి. స్థానికులు కథనం ప్రకారం వివరాలివి. మాడుగుల గ్రామానికి చెందిన పోతల సుభద్రరావు ఎప్పటిలాగే ఏటవతలికి వెళ్లడానికి పెద్దేరులోకి టైరు బండితో దిగారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పెద్దేరులో నీటి ప్రవాహం ఎక్కువ ఉండడంతో తోవ కనపడక గోతిలో దిగిపోవడంతో ఎడ్లు కాళ్లు అందక, నీటిలో మునిగి మృతి చెందాయి. రైతు చాకచక్యంతో తప్పుకోవడంతో ప్రమాదం తప్పింది. తమ మనుగడకు ఆధారమైన కాడెడ్లు మృతి చెందాయని, సుమారు రూ.లక్షా 50 వేలు నష్టం వాటిల్లిందని రైతు సుభద్రరావు ఆవేదన చెందారు.

ప్రభుత్వ నిర్మాణాల్లో ఆర్కిటెక్ట్‌ల భాగస్వామ్యం

డీటీసీపీకి ఐఐఏ విజ్ఞప్తి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో చేపడుతున్న ప్రభుత్వ పరమైన భవన నిర్మాణాల్లో ఆర్కిటెక్ట్‌లను భాగస్వాములుగా చేయాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్(ఐఐఏ) విశాఖపట్నం సెంటర్ చైర్మన్ రాజేష్ నాగుల విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) అదనపు డైరెక్టర్ బి.శ్రీనివాసుల్ని ఏపీ ఆర్కిటెక్ట్‌ల బృందం సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. భవన నిర్మాణాలపై త్వరలో రానున్న ప్రభుత్వ ఉత్తర్వుల ముసాయిదాకు సంబంధించి కొన్ని ముఖ్యమైన సూచనలు, అభ్యర్థనలను సమర్పించారు. రాష్ట్రంలో సమాంతర అభివృద్ధి కోసం ఆర్కిటెక్ట్‌ల పాత్రను తప్పనిసరి చేయాలంటే గ్రూప్ హౌసింగ్, పారిశ్రామిక సముదాయాలు, హాస్పిటల్స్, పర్యాటక అభివృద్ధి వంటి నిర్మాణాల అనుమతుల ప్రక్రియలో ఆర్కిటెక్ట్‌లను భాగస్తులను చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. 500 చ.మీటర్లు పైబడిన ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి, వాటి భద్రత, నాణ్యత, డిజైన్ సమగ్రతల దృష్ట్యా ఆర్కిటెక్ట్‌ల ప్రమేయం తప్పనిసరి చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీటీసీపీ.. ఆర్కిటెక్ట్‌ల సూచనలు, సలహాల్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఏకీకృత రిజిస్ట్రేషన్ విధానంతో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్(సీవోఏ) రిజిస్ట్రేషన్ స్టేటస్‌తో అనుసంధానించిన ఎలాంటి ఇబ్బందుల్లేని లాగిన్ వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరినట్లు రాజేష్ తెలిపారు.

బ్యాంకుకే టోకరా!

- గోల్డ్ రుణం బదలాయింపు పేరిట మోసం
- రూ.14.69 లక్షలు విత్‌డ్రా చేసుకుని పరారీ

సీతమ్మధార: ఓ ఘరానా మోసగాడు బ్యాంకుకే టోకరా వేశాడు. బ్యాంక్ లోన్ లేకుండానే ఉన్నట్లు నమ్మించి మరో బ్యాంక్ నుంచి డబ్బులు కాజేసిన ఘటన ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. అల్లిపురం ప్రాంతానికి చెందిన తమరాన చిరంజీవి(40), మరో వ్యక్తితో కలిసి సోమవారం సీతంపేట ప్రాంతంలో ఉన్న సీఎస్‌బీ బ్రాంచ్‌కు వెళ్లాడు. తనకు సుజాతనగర్‌లో ఉన్న ఫెడరల్ బ్యాంక్‌లో బంగారు ఆభరణాలు తాకట్టులో ఉన్నాయని, వాటిని రిలీజ్ చేస్తే ఆ బంగారాన్ని సీఎస్‌బీ బ్యాంక్‌లో తాకట్టు పెడతానని సిబ్బందికి చెప్పాడు. దీంతో సీఎస్‌బీ సిబ్బంది చిరంజీవికి సంబంధించిన ఫెడరల్ బ్యాంక్ అకౌంట్‌కు రూ.14.69 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీంతో చిరంజీవి ఫెడరల్ బ్యాంక్‌కు వెళ్లి ఆ డబ్బు విత్‌డ్రా చేసుకుని వెళ్లిపోయాడు. ఆ తర్వాత తాము మోసపోయినట్లు సీఎస్‌బీ సిబ్బంది ద్వారకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల ఫొటోలను రిలీజ్ చేసి ఆచూకీ తెలిస్తే ద్వారకా సీఐ 7995093604, ఎస్ఐ ధర్మేంద్ర 8555813894 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

సందేశాత్మకంగా నాటిక ప్రదర్శనలు



వేదాంతం నాటికలో ఓ ఘట్టం

అనకాపల్లి : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో మూడో రోజైన సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలను ఎంపీ సీఎం రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఏడాది క్లబ్‌లో నాటికలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. సోమవారం ప్రదర్శించిన నాటికల విశేషాలు ఇలా ఉన్నాయి.

వేదాంతం నాటిక మూలకథ...

అనకాపల్లి షిర్డిసాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'వేదాంతం' నాటిక ప్రదర్శించారు. మూల కథ కీ.శే.గుడిపాటి వెంకటాచలం, నాటకకరణ మార్గశీర్ష, దర్శకత్వం పి.ముత్యాలరావు. తాను ప్రేమించిన అమ్మాయి తనకు దూరమైన ఆమె రూపాన్ని గుండెల్లో దాచుకుని ఆరాధిస్తూ ఉన్న ఓ ప్రేమికునికి అనుకోని పరిస్థితుల్లో వివాహమైన ఓ అనాఘ్రాత పుష్పంగా తనకు ఎదురుపడితే ఆమె జీవితంలో తిరిగి అరుణోదయం తీసుకు రావడానికి ఆ వ్యక్తి పడిన తపనే ఇతివృత్తంగా నాటిక ప్రదర్శన రక్తికట్టింది.

బాంధవ్యాలను చాటిచెప్పే 'దేవరాగం' : రక్త సంబంధాలు..పేగు బంధాలు..అనుబంధాలు అనే మానవ సంబంధాలు.. తల్లిదండ్రులకి వారి సంతానానికి పరస్పరాధీనం. ఈ బంధం విచ్ఛిన్నమైతే తల్లిదండ్రులకి వృద్ధాప్యం శాపం అవుతుందని, విడవకుండా కంటికి రెప్పలా కనిపెట్టుకుని ఉంటే ఆ వృద్ధాప్యమే ఆ తల్లిదండ్రులకు మధురంగా మారుతుందనేది ఇతివృత్తంగా ప్రదర్శించిన 'దేవరాగం' ఆలోచింపజేసింది. కార్యక్రమంలో నాటకోత్సవ కన్వీనర్ కె.ఎం.నాయుడు, క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు, ప్రధాన కార్యదర్శి బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి విల్లూరి చంద్రశేఖర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ సెంటర్ల తనిఖీకి ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రోగ్రాం అధికారులను ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం –1994పై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రోగ్రాం అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీకి మండల స్థాయిలో శిశు సంక్షేమ శాఖ, తహసీల్దారు, పోలీసు అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం లింగ నిష్పత్తి వెయ్యి మంది బాలురుకు 981 బాలికలు ఉన్నారన్నారు. ఈ నిష్పత్తి సమానంగా ఉండాలన్నారు. ఏ ల్యాబొరేటరీ గాని, స్కానింగ్ కేంద్రం గాని గర్భస్థ పిండం లింగాన్ని తెలిపే ఉద్దేశంతో చేయరాదన్నారు. ఇలా చేస్తే మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తారన్నారు. గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబర్‌కు, ఆన్‌లైన్ గ్రీవియన్స్ (pc pnd-t.a p.go-v.i n) ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. ఆడపిల్ల విలువ అపారమని, వారి రక్షణ బాధ్యత మనదే అని అన్నారు. నూతన వధూవరులకు, గర్భిణులకు, అత్తమామలకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు.

బాల్య వివాహాలను ముందుగానే గుర్తించి తొలి ప్రయత్నాలలోనే నిలువరించాలని తెలిపారు. డీఎంహెచ్‌వో ఎం.ఎస్.వి.కె. బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 73 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిని మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నామన్నారు. సమావేశంలో మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ బాలాజీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, గైనకాలజిస్ట్ శోభాదేవి ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.